క్లుప్తంగా

ఎన్నికల నిబంధనలు గాలికి..



మలుగూరులో పసుపు రంగు తోరణాల మధ్య ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రచారం

హిందూపురం: ఎన్నికల నిబంధన ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలు, విద్యుత్ స్తంభాలు, ఆలయాలు తదితర చోట్ల ప్రచారాలు పోస్టర్లు, జెండాల ప్రదర్శనను నిషేధించారు. అయితే ఎమ్మెల్యే బాలకృష్ణ ఎన్నికల ప్రచారంలో నిబంధనలను గాలికొదిలేశారు. గురువారం పెద్దగుడ్డంపల్లి, మలుగూరు గ్రామాలకు ప్రచార రథంలో తరలివెళ్లిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బాలకృష్ణను స్వాగతించేందుకు టీడీపీ నాయకులు విద్యుత్ స్తంభాలు, ప్రభుత్వ భవనాలపై జెండా, తోరణాలు కట్టారు. వీరికి ఎన్నికల నిబంధనలు వర్తించవా? అని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



రఘునాథరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మధుమతిరెడ్డి

హిందూపురం: వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు సడ్లపల్లి డి.రఘునాథ్‌రెడ్డి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి సడ్లపల్లిలోని వారి ఇంటికి వెళ్లి రఘునాథరెడ్డి మృతదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులని పరామర్శించారు. అలాగే చౌళూరు గ్రామంలో ఎం.సంజీవప్ప అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులకు పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు తిమ్మిరెడ్డి, బాబు రెడ్డి, లోకేష్ రెడ్డి, అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపుతోనే 'పురం' అభివృద్ధి



ఇంటింటి ప్రచారంలో ముస్లిం, మైనార్టీ నాయకులు

హిందూపురం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపుతోనే హిందూపురం నియోజక అభివృద్ధి సాధ్యమని మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, మాజీ ముతవల్లీలు ఖలీముల్లా, అజీజ్‌సాబ్ అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్.దీపిక, ఎంపీ అభ్యర్థి బి.శాంతమ్మ గెలుపు కోసం ముస్లిం మైనార్టీ పెద్దలు మండలంలో ప్రచారం చేపట్టారు. పూలకుంట గ్రావ పంచాయతీలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. ముస్లిం, మైనార్టీల అభ్యున్నతి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో సాని ముత్తవల్లీ హుమయున్, వైస్ ప్రెసిడెంట్ ఖలీల్, సలాం, జామియా మసీద్ కమిటీ మెంబర్ నూరుల్లా, ఇలియాజ్, ఆర్ కే ఖలీల్, షేక్ షబ్బీర్, సాధిక్, లతీఫ్‌సేట్, మాలిక్, ముదసిర్, మార్కెట్ చాంద్ బాషా, ఇనాయత్, తదితర మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

చిలమత్తూరు: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి రమ గురువారం తనిఖీ చేశారు. ఈ మేరకు ఆమె రికార్డులను పరిశీలించారు. అనంతరం శాశ్వత చందాలు పెంచాలని, పాఠకుల సంఖ్య కూడా పెరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రంథాలయాధికారి మల్లికార్జునకు సూచించారు. పుస్తక పఠనం ద్వారా కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించాలని సూచించారు.

జోరుగా ఎన్నికల ప్రచారం



మసీదు బయట ప్రచారం చేస్తున్న మైనార్టీ నాయకులు

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలోని ముస్లిం మత పెద్దలు వైఎస్సార్‌సీపీ తరుపున గురువారం సాయంత్రం ప్రచారం చేశారు. ప్రతి ముస్లిం మైనార్టీ ఇంటికెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తున్న శాంతమ్మ, దీపికలను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. మత పెద్దలు మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. లేపాక్షి ముతవల్లి సయ్యద్ అన్సార్, హిందూపురం మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, లతీఫ్‌సేట్, చాందు, ఖలీల్‌తో పాటు స్థానిక నాయకులు హబీబ్‌సాబ్, యూనస్, నిస్సార్‌సాబ్, ఉస్మాన్‌సాబ్, అయూబ్ సాబ్, సయ్యద్‌నిస్సార్ తదితరులు పాల్గొన్నారు.

మంచి పాలకునికే మా ఓటు



- 28,746 మందికి నూతనంగా ఓటు హక్కు
- పోలింగ్ శాతం పెరిగేలా అధికారుల చర్యలు
- భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ఓటేస్తామంటున్న యువత

హిందూపురం అర్బన్: ప్రజా సంక్షేమం, అభివృద్ధి కాంక్షించే వారికే తాము ఓటు వేస్తామని తొలిసారి ఓటు హక్కు పొందిన యువతీ, యువకులు చెబుతున్నారు. పాలకులు మంచి వారైతే దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయని అంటున్నారు. జిల్లాలో 13,97,697 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 18,19 ఏళ్ల యువత 28,746 మంది ఉన్నారు. మే 13న నిర్వహించనున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో వీరు తొలిసారి ఓటు వేయనున్నారు. ప్రలోభాలకు లొంగకుండా నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుమని వారు స్పష్టం చేస్తున్నారు.

పెరగనున్న ఓటింగ్ శాతం..

18–19 ఏళ్ల యువత ఓటర్లుగా నమోదయ్యేందుకు జిల్లా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇంజినీరింగ్, ఇతర వృత్తి విద్యా సంస్థలు, యూనివర్సిటీలులో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సారి ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచే విధంగా ఎన్నికల కమిషన్ పిలుపునిచ్చింది. 2019 వరకూ జరిగిన ఎన్నికలు పరిశీలిస్తే ఓటింగ్‌కు 40 శాతం యువత దూరంగా ఉంటోంది. ఈసారి ఎన్నికల్లో 80 శాతం ఓటింగ్ ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

తప్పకుండా ఓటు వేస్తా



ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటరయ్యేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాను. దరఖాస్తు ఆమోదించి ఓటరుగా నమోదు చేశారు. స్మార్ట్ ఎపిక్ కార్డు కూడా వచ్చింది. ఇప్పుడు నాకు హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటు ఉంది. పోలింగ్ రోజు ఎన్ని పనులున్నా తప్పకుండా ఓటు వేస్తాను. స్వేచ్ఛగా, నిర్భయంగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకుంటాను.

– అశ్విని, కల్లూరు

మంచి నాయకుడిని ఎన్నుకుంటాం



2023లో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నాను. అధికారులు పరిశీలించి నా దరఖాస్తును ఆమోదించారు. ఓటరు కార్డు కూడా వచ్చింది. మొదటిసారి ఈ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోబోతున్నందుకు సంతోషంగా ఉంది. మంచి పాలకున్ని ఎన్నుకోవడంలో మాలాంటి యువత పాత్ర కీలకం. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకుంటా.

– నిరంజన్‌రెడ్డి, మరువకొత్తపల్లి, చిలమత్తూరు మండలం

భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని...



ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోగానే అధికారులు ఆమోదించి ఓటరుగా నమోదు చేశారు. ఓటు హక్కు వచ్చిందనందుకు చాలా ఆనందంగా ఉంది. ఓటు హక్కు వజ్రాయుధం. నా ఓటు స్వేచ్ఛగా కచ్చితంగా వినియోగించుకుంటా. పాలకులు మంచి వారిని ఎన్నుకుంటే దేశం, రాష్ట్రం బాగుంటాయన్నది నా అభిప్రాయం. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఓటు వేస్తాను. నా మిత్రులు కూడా ఓటు వినియోగించుకునేలా వారిలో చైతన్యం తీసుకొస్తా.

– వేదవ్యాస్‌రెడ్డి, హిందూపురం.

రేపు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాక



మడకశిర: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం మడకశిరకు వస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు మడకశిర అసెంబ్లీ అభ్యర్థి ఈరలక్కప్ప ఇంటి ఆవరణంలో జరిగే నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశంలో మంత్రి పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీ అభ్యర్థి ఈరలక్కప్ప, ఎంపీ అభ్యర్థి శాంతమ్మ తరుపున మంత్రి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పరిశీలకులు పోకల అశోక్‌కుమార్, ఎన్నికల పరిశీలకులు ప్రసాద్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. మడకశిరలోని మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ్ ఇంట్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తేనేటి విందు స్వీకరిస్తారని వివరించారు. ఆ తర్వాత మధ్యాహ్నం మండలంలోని సిద్ధగిరిలో మాజీ ఏడీసీసీ బ్యాంక్ ఉపాధ్యక్షుడు ఆనందరంగారెడ్డి స్వగృహంలో భోజనం చేస్తారన్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

- చివరి రోజు మడకశిరలో 13 నామినేషన్లు
- 'పురం' లో ఏడు నామినేషన్ల దాఖలు

మడకశిర: మడకశిరలో గురువారం నామినేషన్ల ఘట్టం ప్రశాంతంగా ముగిసింది. ఈ నెల 18 నుండి 25 వరకు నామినేషన్లను స్వీకరించారు. మొత్తం 34 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల చివరిరోజు గురువారం 13 నామినేషన్లు దాఖలైనట్లు ఆర్‌ఓ గౌరీశంకర్‌రావు తెలిపారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎస్ఎల్ ఈరలక్కప్ప తరుపున జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్ తదితరులు మరోసెట్ నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ తరుపున కె సుధాకర్, బీఎస్‌పీ తరుపున ఇందివర్, వైఎస్సార్‌సీపీ తరుపున తిప్పేస్వామి, టీడీపీ తరుపున మంజునాథ్, ఎంఎస్ రాజు, రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా తరుపున హనుమంతరాజు, స్వతంత్ర అభ్యర్థులుగా మాజీ ఎమ్మెల్యే ఈరన్న, డాక్టర్ సునీల్ కుమార్, ఎస్ సునీల్ కుమార్, ధనరాజ్, రాజన్న, మోరుబాగల్ రాజ నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్‌ఓ తెలిపారు.

నేడు నామినేషన్ల పరిశీలన

మడకశిర తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను పరిశీలించనున్నట్లు ఆర్‌ఓ తెలిపారు. సక్రమంగా ఉన్న నామినేషన్లను అమోదించి సక్రమంగా లేని వాటిని తిరస్కరిస్తామన్నారు.

'పురం'లో మొత్తం 39 నామినేషన్లు

హిందూపురం: నామినేషన్ల స్వీకరణలో భాగంగా గురువారం చివరిరోజు ఏడు నామినేషన్లు దాఖలు అయ్యాయి. హిందూపురం తహసీల్దార్ కార్యాలయంలో సంయుక్త కలెక్టర్, నియోజకవర్గ ఆర్‌ఓ అభిషేక్ కుమార్ ఆధ్వర్యంలో హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ నామినేషన్లు స్వీకరించారు. వైఎస్ఆర్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థిగా టీఎన్.దీపిక, అలాగే వైఎస్సార్‌సీపీ తరుపున గుడ్డంపల్లి వేణురెడ్డి కూడా నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ అసెంబ్లీ అభ్యర్థిగా వసుంధరదేవి రెండుసెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంహెచ్.ఇనాయతుల్లా రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేయగా కాంగ్రెస్ పార్టీ తరుపున ఎస్.హసీనాభాను కూడా నామినేషన్ దాఖలు చేశారు. ఇండియన్ ప్రజాకాంగ్రెస్ తరుపున కె.ఆర్.పార్వతీ నామినేషన్‌దాఖలు చేశారు. ఎస్‌యూసీఐ రవీంద్రనామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా స్వామి పరిపూర్ణానంద, జి.లోకేంద్రనాథ్, కె.సాయినంది, జి.సురేష్, తలారి శ్రీనివాసులు, జి.వెంకటేష్‌రెడ్డిలు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల పర్వం ముగిసేనాటికి మొత్తం 39 నామినేషన్లు దాఖలైయ్యాయి.



మడకశిర: ఈరలక్కప్ప తరఫున మరో సెట్ నామినేషన్ దాఖలు చేస్తున్న నాయకులు

సంక్షిప్త సమాచారం

నేడు ఎన్నికల ప్రచారం

అమరాపురం: మండల పరిధిలోని బసవనపల్లి, ఆలదపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రచార కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ హాజరవుతారన్నారు. మండలంలోని వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల అనుబంధ విభాగం సభ్యులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అనుమతులు లేని పాఠశాలల్లో చేర్పించొద్దు

హిందూపురం టౌన్: అనుమతులు, గుర్తింపు లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించొద్దని విద్యార్థుల తల్లిదండ్రులకు ఎంఈఓ గంగప్ప సూచించారు. పట్టణంలోని డీబీ కాలనీలో భాష్యం పాఠశాల 1 నుంచి 10వ తరగతి వరకు ఇంటింటికి వెళ్లి అడ్మిన్ చేస్తున్నట్లు తమకు విద్యార్థి సంఘాల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. ఆ పాఠశాలకు గుర్తింపు కానీ, అనుమతులు కానీ లేవన్నారు.

టీడీపీ రెబల్ అభ్యర్థిగా సురేష్ నామినేషన్

మడకశిర: హిందూపురం పార్లమెంట్ స్థానానికి టీడీపీ రెబల్ అభ్యర్థిగా గుడిబండ మండలం కేఎస్ పల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సురేష్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈయన మాజీ ఎమ్మెల్యే ఈరన్న వర్గీయుడు. ఈరన్న తనయుడు సునీల్‌కుమార్‌కు తొలుత టీడీపీ టికెట్ ఇచ్చి...ఆ తర్వాత ఆయన స్థానంలో ఎంఎస్ రాజుకు కేటాయించిన విషయం తెలిసిందే. హిందూపురం పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి కుట్రపన్ని సునీల్‌కుమార్‌కు టికెట్ లేకుండా చేశారని ఈరన్న వర్గీయులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎలాగైన సరే పార్థసారథిని ఓడించాలని ఈరన్న వర్గీయులు నిర్ణయం తీసుకుని సురేష్‌ను ఎంపీ రెబల్ అభ్యర్థిగా పోటీ చేయిస్తున్నట్లు సమాచారం. సురేష్ కుంచిటి వక్కలిగ సామాజిక వర్గానికి చెందిన వారు. ఈ వర్గానికి చెందిన ఓట్లు పార్థసారథికి పడకుండా అడ్డుకోవడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఏది ఏమైనా సురేష్ పోటీతో పార్థసారథి గడ్డు పరిస్థితి ఎదుర్కోవడం ఖాయంగా కన్పిస్తోంది.

ఎన్నికలకు సర్వం సిద్ధం

పావగడ: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా తాలూకా వ్యాప్తంగా శుక్రవారం జరిగే పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక స్టేడియం మైదానంలో ఏర్పాటు చేసిన మస్టరింగ్ కేంద్రాల నుంచి 246 పోలింగ్ స్టేషన్లకు ఈవీఎంలు, ఎన్నికల పరికరాలతో వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది బస్సుల్లో తరలివెళ్లారు.

జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి



మడకశిరలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న ఈరలక్కప్ప



మల్లేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఈరలక్కప్ప, నాయకులు

- సీఎంగా జగన్ ఉంటేనే పేదలకు సంక్షేమం
- చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

మడకశిర: నియోజకవర్గ ప్రజలందరూ వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి గెలిపించాలని మడకశిర అసెంబ్లీ అభ్యర్థి ఈరలక్కప్ప విజ్ఞప్తి చేశారు. ఆయన గురువారం పట్టణంలోని 10, 11వ వార్డుల్లో జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. అంతకు మునుపు ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 10, 11వ వార్డుల్లో ప్రచారం సందర్భంగా ఈరలక్కప్పకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. మహిళలు ప్రచారంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముస్లిం మైనార్టీలు ఈరలక్కప్పకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వైఎస్ జగన్ సీఎం అయితేనే ప్రజలకు సంక్షేమ పథకాలు కొనసాగుతాయని తెలిపారు. లేకపోతే సంక్షేమ పథకాలు అందక పేదలు నష్టపోవాల్సి ఉంటుందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం వైఎస్ జగన్ నడుచుకున్నారని తెలిపారు. హామీలన్నీ నెరవేర్చి పేదలకు అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. పేదల పక్షపాతి వైఎస్ జగన్ అని కొనియాడారు. వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు అధికారం కోసం తప్పుడు హామీలు ఇస్తున్నారని ధ్వజమెత్తారు. 2014 ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను నట్టేట ముంచిన సంగతి ఇంకా ఎవరూ మర్చిపోలేదన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో కూడా తప్పుడు హామీలతో ప్రజల ముందుకు వస్తున్నారని, చంద్రబాబు మాయమాటలను నమ్మి మోస పోవద్దని కోరారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు అండగా ఉంటానన్నారు. సేవకుడిగా ప్రజల కోసం పని చేస్తానని తెలిపారు. పేదవాడైన తనకు వైఎస్ జగన్ టికెట్ ఇచ్చారని, జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటానన్నారు. తనతో పాటు ఎంపీ అభ్యర్థి శాంతమ్మకు కూడా ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్ రెడ్డి, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, రంగేగౌడ్, పట్టణ కన్వీనర్ పుట్ట కామప్ప, జేసీఎస్ కన్వీనర్ విక్రమ్, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, కౌన్సిలర్లు అంజన్ కుమార్‌యాదవ్, అన్సర్, అక్రమ్, నాగేంద్ర, దాసన్న, మేఘన రమేష్, శ్రీనివాస్, సతీష్‌రెడ్డి, తిమ్మక్క, సిద్ధప్ప, కోఆప్షన్ సభ్యులు క్రిష్ణమూర్తి, ఫకృద్దీన్, గుడిబండ జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు రాజేష్, నరసింహారెడ్డి, జయరాజ్, వెంకటరంగారెడ్డి, సురంగల నాగరాజు, నాగభూషణ్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరుతున్న నాయకులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆర్ అనంతపురం, ఏఆర్ రొప్పం గ్రామాల నుంచి 10 కుటుంబాలు టీడీపీ, జనసేన పార్టీలను వీడి జేసీఎస్ కన్వీనర్ తిమ్మప్ప ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఆనంతరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ సభ్యుడు శ్రీరాములు, న్యాయవాది అశ్వత్తనారాయణ, సర్పంచ్ అంజినమ్మ, గుడిబండ జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, నాయకులు శివగంగప్ప, నాగభూషణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాల తనిఖీ

మడకశిర: పట్టణంలోని వైజ్ ఉడ్ ప్రైవేట్ పాఠశాలను గురువారం స్థానిక ఎంఈఓ భాస్కర్ తనిఖీ చేశారు. విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తున్నట్లు ఫిర్యాదులు వెళ్లడంతో విచారణ చేసి నివేదిక పంపాలని ఎంఈఓకు ఆదేశాలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఆయన విచారణ చేశారు. ముందస్తు అడ్మిషన్లపై ఆరా తీశారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



హిందూపురం: మలేరియా నివారణపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



మడకశిర: మాట్లాడుతున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి షమీవుల్లా

మడకశిరరూరల్: ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే వ్యాధులు సోకకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి షమీవుల్లా, డాక్టర్ లిఖిత తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం కదిరేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ రాణి, ఎంపీహెచ్‌ఈఓ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

లేపాక్షి: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం లేపాక్షి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి అత్యంత ప్రమాదకారి దోమ అని పేర్కొన్నారు. అత్యధిక మరణాలు దోమల ద్వారానే సంభవిస్తున్నట్లు చెప్పారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరు శ్రద్ధ వహించి దోమల వ్యాప్తిని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం, పీహెచ్‌ఎన్ భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం టౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని తగ్గించి, ఆరోగ్యంగా ఉంటామని డాక్టర్ అయేషా తస్లీమ్, సబ్ యూనియన్ అధికారి శివన్న తెలిపారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా బోయపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సమానత్వం కోసం మలేరియా వ్యతిరేక పోరాటాన్ని ఉధృతం చేద్దామని పిలుపునిచ్చారు. దోమ చిన్నదేనైనా దానితో ఎక్కువగా ప్రమాదం పొంచి ఉందని, దోమల వలన మలేరియా వ్యాధి వ్యాప్తి జరుగుతోందన్నారు. దోమల నియంత్రణ ముఖ్యమైనదని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. ప్రతి ఇంటికి మెష్‌తో కూడిన తలుపులు, కిటికీలను అమర్చుకోవాలన్నారు. అలాగే రాత్రి వేళల్లో దోమతెరలు వాడాలన్నారు. మలేరియాకు సంబంధించిన పరీక్షలు, అవసరమైన చికిత్సలు అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా లభిస్తాయని చెప్పారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం



రత్నగిరిలో మహాకాళి రూపంలో దర్శనం ఇస్తున్న కొల్హాపురి మహాలక్ష్మీదేవి



జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న రాజవంశీకులు

రొళ్ల: మండల పరిధిలోని చారిత్రాత్మక ప్రదేశమైన రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారికి జ్యోతుల ఉత్సవాన్ని వైభంగా నిర్వహించారు. రొళ్ల మండలం టీడీ పల్లి, హనుమంతనపల్లి, వన్నారనపల్లి, హులికుంట, దొమ్మరహట్టి, కొడగార్లగుట్ట, కొత్తపాళ్యంతాండ, రొళ్లకొండ, అలుపనపల్లి, ఏ.వద్రహట్టి, దాసప్పపాళ్యం, క్యాతప్పపాళ్యం, వన్నప్పపాళ్యం, జీఎన్ పాళ్యం, బాజయ్యపాళ్యం, పి.గొల్లహట్టి, గొట్టుగుర్కి, రంగనపల్లి, వెంకటంపల్లి తదితర గ్రామాల్లో కొల్హాపురి మహాలక్ష్మీదేవి అమ్మవారికి జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. గ్రామాల్లో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు భాగా పండాలని అమ్మవారిని భక్తులు ప్రార్థించారు. రత్నగిరి రాజవంశీకులు కుటుంబ సమేతంగా జ్యోతులతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని జ్యోతులను సమర్పించారు. ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాలతో పాటు సమీపాన కర్ణాటక ప్రాంతం నుంచి కూడా వందల సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు కూడా ఉత్సవాలు...

మండలంలోని రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కూడా వివిధ గ్రామాల వారిచే అమ్మవారికి జ్యోతుల ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం

రొళ్ల: మండల పరిధిలోని పిల్లిగుండ్ల చెక్‌పోస్టు వద్ద గురువారం సాయంత్రం రత్నగిరికి చెందిన ఆనంద్ అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యం ప్యాకెట్లు తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. సమీపంలోని కర్ణాటక ప్రాంతం హొసకెర నుంచి కాలినడకన నడిచి వస్తుండగా తనిఖీ చేశామన్నారు. అతని వద్ద 15 (90ఎంఎల్) కర్ణాటక మద్యం ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆనంద్‌పై కేసు నమోదు చేశామని చెప్పారు.

పావగడ: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వైఎన్ హొసకోట హోబళికి చెందిన సిద్ధాపురం గ్రామం జాలోడు రోడ్డు వద్ద ఉన్న మద్యం దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన రెండు మద్యం సంచులను స్థానిక రూరల్ సీఐ గిరీశ్ గురువారం స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం నిర్వహిస్తున్న తొలిదశ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా తాలూకా వ్యాప్తంగా అన్ని మద్యం దుకాణాలను మూసివేశారు. అయితే ఆంధ్ర సరిహద్దులోని సిద్ధాపురం గ్రామం జాలోడు రోడ్డు వైపు ఎన్నికల విధి నిర్వహణలో భాగంగా వెళ్తున్న సీఐ గిరీశ్ అక్కడ ఉన్న ఓ మద్యం దుకాణంలో పరిశీలించగా రెండు అక్రమ మద్యం సంచులు బయట పడ్డాయి. తక్షణమే వాటిని స్వాధీనం చేసుకుని మద్యం అంగడి యజమానిపై కేసు నమోదు చేసినట్లు సీఐ గిరీశ్ తెలిపారు.